# వెలుగు నీడలు!

రచన : శ్రీ మౌల్యశ్రీ



(గతసంచిక తరువాయి)

'కృష్ణమూర్తని నా చిన్నప్పటి స్నేహితుడు. అతనిదికూడ మా వూరే! ఇప్పుడు హైదరాబాద్‌లో పెద్ద కంపెనిలో ఉద్యోగం చేస్తున్నాడు.'

లోపల భార్యతో కాబోలు నా గురించి చెపుతున్నాడు రామచంద్రం.

నేను కుర్చీలో బారగిల బడి, ఆ ఇంటి పరిసరాలు గమనిస్తున్నాను. వరండా అంతా ముగ్గులు పెట్టారు. దీపం వెలుగులో వాటిలోని కళాత్మకత కొట్ట వచ్చినట్లు కనిపిస్తోంది. మా మామూలు మట్టిగోడలే వాటిని శుభ్రంగా పూసి, చుక్కలు పెట్టారు చక్కటి డిజైన్‌లో! ద్వారానికి ఇరువైపులా గోడలకి వ్రేలాడుతున్న నాలుగైదు దేవతల ఫోటోలు! చివరగా తిధివార నక్షత్రాలు తెలిపే కేలండరు గాలికి రెపరెపలాడుతోంది!

'కాళ్లు కడుక్కోండి!' ఆప్యాయతతో కూడిన తీయని కంఠానికి ఇటు తిరిగి చూశాను. ఆమె చెంబుతో నీళ్ళు, టవలు తీసుకొచ్చింది.

అక్కడనించి లేచి వెళ్ళడం ప్రస్తుతం బద్ధకమనిపించినా మర్యాదగా వుండదని కుర్చీమీంచి లేచి వెళ్లాను.

ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కుని టవలుతో తుడుచుకునివచ్చి కూర్చున్నాను.

'మంచినీళ్లు తీసుకురమ్మంటారా'' ఆమె అడిగింది.

'అవసరం లేదులెండి!' సమాధానం చెప్పాను.

తరవాత రామచంద్రం పాప నెత్తుకొని వచ్చాడు.

ఇంతేసి కాటుక కళ్ళు! నిగనిగలాడుతున్న ముంగురులు ఎర్రని పెదాలు, గులాబిరంగు దోబూచులాడుతున్న బుగ్గలు ముద్దుగా, బొద్దుగా ఆ పాపాయి ఎంతో అందంగా వుంది. నాకేసి చూస్తూ నవ్వు మొహంతో కేరింతాలు కొడుతూ, చేతులు చాస్తోంది!

'దీనికి కొత్తా పాతా లేదయ్యా బాబూ! అందరినీ ఎతుకోమని హటం చేస్తుంది. పెద్దయితే ఎంత గడసరిదౌతుందో! అంటోన్నాడు మురిసిపోతూ రామచంద్రం.

'గడుసుదౌతే ఎవరు చేసుకుంటారు? కట్న మెక్కువ పోయాలేమో!' రామచంద్రం భార్య అంది.

'ఆఁ ఆఁ! అదేం కుదరదు. పైసా కట్నం ఇచ్చేదిలేదు ఎంత కట్నమిచ్చి మీ వాళ్ళు నిన్ను నాకు కట్టబెట్టారేమిటి?' రామచంద్రం భార్యని పరిహాసమాడాడు.

'నేనేం మీ కూతురిలాగ గడుసుదాని కాదులెండి! కట్నమిచ్చిన వాళ్ళనీ, వీళ్ళనీ బ్రతిమాలడానికి?' ఆమె తిప్పి కొట్టింది.

'కాదు పాపం! ఈ రామచంద్రాన్ని తప్పిస్తే మరొకరిని చేసుకోనని మీ వాళ్ళని ముప్పతిప్పలుపెట్టి, ముచ్చట తీర్చుకుంది అందుకే కాబోలు!' రామచంద్రం అందుకున్నాడు.

ఆమె కొస్తంత సిగ్గుపడి నవ్వుతూ— 'ఎందుకులెండి మీ అన్నగారున్నారు. అసలు విషయం చెబితే చిన్నబుచ్చుకుంటారు!' అంది ఆమె భర్తవైపు కొంటెగా చూస్తూ-ఏదో రహస్యం దాస్తున్నట్లు.

'కొత్త వ్యక్తిని నేనున్నాననే ధ్యాసయినా లేకుండా ఆ దంపతులిద్దరూ అలా అన్యోన్యం హాస్యాలాడుకోవడం నాకు ఎంతో ముచ్చటనిపించింది.

వాళ్ళు కాటు దంబం తెలియని రైతు బిడ్డలు! తాము కష్టపడి సంపాదించి తిని, ఇతరులకు పెట్టేవాళ్ళు! ఆర్ద్రమైన అంతఃకరణా, ఆత్మాభిమానం వాళ్ళ సహజత్వం! కుహనాగౌరవాలు. కృత్రిమ విలువలు వాళ్ళ దరిదాపులకు చేరలేదు. అందుకే వాళ్లు కడిగిన ముత్యాల్లా, నిర్మలంగా, నిరాడంబరంగా, నవ్వుతూ, తృళ్ళుతూ జీవితం సాగిస్తున్నారు. త్రికరణ శుద్ధితో కూడిన వాళ్ళ జీవన సంగీతానికి ముగ్ధుడుకాని సహృదయుడెవరుంటారు?

ఆ యువదంపతుల తొలినోము పంట. ప్రేమస్వప్నాల ప్రతిబింబం ఆ పాపాయి! మల్లెమొగ్గలా, పవిత్రంగా ముద్దులొలుకుతూన్న ఆ బంగారు పాపాయిని ఒక్కసారి చేతులోకి తీసుకొని, ఆ లేతచెక్కిళ్ళని స్పృశించాలనిపించింది.

'నా దగ్గరికి రావమ్మా!' చేతులు చాచాను. పాప కేరింతలు కొడుతూ చేతులోకి వచ్చింది.

ఆప్యాయంగా రెండు చేతులా అందుకుని ఒళ్లోకి తీసుకున్నాను. ప్రేమతో బుగ్గలు స్పృశిస్తూంటే ఆ పాప అమాయకంగా నవ్వుతోంది.

'పేరేమిటి?' అడిగాను.

'వాళ్ళమ్మగారి పేరు పెట్టారు!' అందామె భర్తని చూస్తూ.

'ఏమిటి వెంకటరమణమ్మగారా? భేష్!' నా సమర్థన.

'ఆమె అమ్మగారి పేరు పెట్టలేదని ఆమె కోపం!' రామచంద్రం అన్నాడు.

అవును. అత్తగారంటే ఏ కోడలికి నచ్చుతుంది?' నేను సరదాగా అన్నాను.

'ఏమైనా అన్నదమ్ములంతా ఒకటే! అనండి బాబూ! ఎంత మంచిగా నడుచుకున్నా అత్తకు మంచిదవుతుందా ఏ కోడలన్నా లోకంలో!' ఆమె నిష్ఠూరంగా అంది.

(4)

'చూడవయ్యా కృష్ణయ్యా! నీ మరదలికి ఎంత ఉక్రోషమో! ఇల్లాంటి ముక్కుమీద కోపంవున్న ఇల్లాలితో ఎట్లా కాపరం చేస్తున్నానో చూడు' రామచంద్రం అన్నాడు.

'అవునులెండి! మీరు గనుక శాంతమూర్తులు గాబట్టి ఇంకా నాతో కాపురం చేస్తున్నారు. మరొకళ్లయితే సన్యాసం పుచ్చుకుని అడవుల కెళ్ళిపోయేవారు.' ఆమె పైటచెంగు నోటికడ్డం పెట్టుకొని నవ్వాపుకుంటోంది.

'చూడవయ్యా! ఆమె ఎత్తిపొడుపు!' రామచంద్రం భుజాలు తడుముకొన్నట్లు అన్నాడు.

'సర్లెండి! పాపాయిని తీసుకోండి! చొంగలు కారుస్తూ నానె జిడ్డుతో ఆయనగారి తెల్లటి బట్టలు పాడుచేస్తోంది.' అంది భర్తని హెచ్చరిస్తూ.

'అల్లాంటి అల్లరిపిల్ల నాకెందుకు? నువ్వే తీసుకో!' రామచంద్రం బింకం నటిస్తూన్నాడు.

'పాపం మీరు కనబడలేదు కాబోలు! ఎల్లాంటిదయితే

ఫోన్ నెం. 21386 ఆఫీసు : 23248



Saradha
KNITTING MILLS
TIRUPUR—638 602


ISI : 325


* మోటారులు * పంపులు.

* మోనోబ్లాకులు.

వ్యవసాయానికి, పరిశ్రమలకు

అత్యుత్తమమైనది.





: తయారించువారు :

సదరన్ ఇంజినీరింగ్ ఇండస్ట్రియల్స్

343. అవనాశి రోడ్డు కోయంబత్తూరు-641 037.

బ్రాంచీలు :—

30. తంబుచెట్టివీధి, మదరాసు-600 001.

88. అరుణాచల ఆచారివీధి, సేలం-636 001.

దక్షిణ ప్రాంతానికి విక్రయ ఏజెంట్లు :—

గార్డెన్ ఉడ్ రాఫే ఏజన్సీస్ (ప్రైవేట్) లిమిటెడ్,

7/21, బీచ్‌రోడ్డు, మదరాసు-600 001.

నేమి మా పాప మాకు బరువా? రామ్మా!' బిడ్డకోసం చేయి చాపిందామె,

పాప తల్లికేసి చూసి, ఏమనుకుందో ఏమో, మళ్ళీ ఇటు తిరిగి నన్ను కౌగలించుకుని, వెళ్ళనని మొరాయించింది. అందరం నవ్వేశాం!

స్నానాలయ్యాక భోజనాంకి పిలుపొచ్చింది. వెళ్ళి పీటల మీద కూర్చున్నాం. అరిటాకుల్లో భోజనాలు వడ్డించారు. రెండు మూడు కూరగాయలు, పప్పు, చారు, ఆవకాయ పచ్చడి, కమ్మటి నేయి, మొత్తానికి విందుభోజనంలా ఉంది.

'పొద్దుపోయి వచ్చారు. ఇంతకంటె ఎక్కువ చెయ్యలేక పోయాను. ఇదా పల్లెటూరు! ఇక్కడేమీ దొరకవు. మీకు సంతృప్తి కలుగుతుందో లేదో! మీరు పట్నం వాళ్లాయిరి-' ఆమె ఎంతో ఇదవుతూ, భోజనం దగ్గర ఎక్కడ నేను అసంతృప్తి పడతానో అని తమ అశక్తత గురించి వెల్లడిస్తోంది.

'నేనూ పల్లెటూళ్ళో పుట్టి పెరిగిన వాణ్నేనమ్మా! నాకేం పట్టింపులులేవు. అయినా ఈ భోజనానికేం దివ్యంగా ఉంది. ఇంతకంటే మాత్రం టౌన్లో ఏం తింటాం? ఆత్మీయుల ఆదరంతో పెట్టిన దానికంటే మరేదీ సంతృప్తిగా వుండదు. మీ ఆదరాభిమానాలతోనే నా కడుపు పూర్తిగా నిండిపోయింది.' నేను కృతజ్ఞతా భరితంగా ఆమెవైపు చూశాను.

వాత్సల్యం పెల్లుబుకుతున్న వదనంతో ఆమె వెలిగిపోయింది.

అంతకుముందు ఆమెను స్పష్టంగా చూడలేదు నేను. ఇప్పుడు దీపం వెలుగులో ఆమె రూపం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రకాశవంతమయిన గాఢమైన కళ్ళు, తీరైన ముక్కు, నవ్వినప్పుడు మల్లెమొగ్గల్లా మెరిసిపోయే తెల్లని పలువరస, నల్లని వాలుజడ. నుదుట ఎర్రటి కుంకుమబొట్టు, మెడలో ఒంటిపేట బంగారు గొలుసు. చేతులకు రంగు రంగుల గాజులు—ఆ వెలుగులో ఆమె ఆకర్షణీయంగా, అందంగా మెరిసిపోతోంది. ఆకుపచ్చ సిల్కు జాకెట్టు వేసుకుంది. అదే కలర్‌లో వున్న పల్చని నేత చీరలో ఆమె సన్నగా, బంగారు శలాకలా వుంది.

ఆమె కళ్లు మిరుమిట్లుగొలిపే విద్యుల్లత కాదు. ఎంతసేపయినా నేత్రానందకరంగా తిలకింపజేసే సౌదామిని! పౌడర్లు, క్రీములు, లిప్‌స్టిక్‌లు, హెయిర్‌స్టైల్సు, మేకప్పులు దేవత వస్త్రాలు, నవనాగరిక సంస్కృతి, ఆడంబరం, అతిశయంలాంటి వాటితో జిగేలుమనిపించే కృత్రిమ సౌందర్యత కాదామెది. అణకువ, అనురాగం, త్యాగం, సేవ, పవిత్రత వాత్సల్యం, మార్దవం, మాధుర్యం, సౌశీల్యం, సద్గుణం సమ్మిళితమయిన సహజ గ్రామీణ శ్రమజీవన సౌందర్యం ఆమెది! దానికి ఆరాధనా భావంతో చేతులెత్తి జోహార్లు చేయాలనిపిస్తుంది.

మారన్నం వేయించుకోకుండానే పెరుగు కలుపుకోబోతున్నాను.

'అదేమిటి? మీరు వడ్డించుకోకుండానే లేస్తారేమిటి? జాగుంది! ఇంకాస్త అన్నం వడ్డిస్తాను.' ఆమె గబగబా ఇంకాస్త అన్నం వడ్డించేసింది.

'ఇంత వడ్డించేశారు! ఎట్లా తినాలి?' ఇబ్బందిగా అన్నాను.

'ఈ కాస్తకేనా? భలేవారండి!' నవ్వుతూంది!

గిన్నెలో పెరుగంతా అన్నంలో కుమ్మరించింది.

వాళ్ళ ఆదరణతో, భోజనంతో, ఉక్కిరిబిక్కిరై లేచి వరండాలోకొచ్చి కుర్చీలో కూలబడ్డాను. వాళ్ళ ఆప్యాయత ఆతిథ్యాన్ని తలచుకొంటూ ఏదో అనుభూతిలో తేలిపోతున్నాను.

రామచంద్రం కొంచెంసేపట్లో వచ్చినా ప్రక్కనే మంచం వాల్చుకుని కూచున్నాను.

యథాలాపంగా అతనివైపు చూశాను, ఆత్మవిశ్వాసాన్ని సూచించే నిశితనేత్రాలు, పట్టుదలకి చిహ్నమైన కొనదేరిన నాసిక. స్థిరమైన స్వభావానికి సంకేతమయిన బిగువైన పెదాలు. సౌమ్యత్వాన్ని ప్రకటించే విల్లులవంటి కనుబొమలు సాహసానికి ప్రతిబింబాలైన సన్నని కోసమీసాలు, ధైర్య, సాహసాలకి నిలయమైన విశాల వక్షం, కష్టసహిష్ణుతకూ, కార్యశీలతకూ దర్పణాలైన ఆరోగ్యవంతమై కమ్మెచ్చున తీసిన కండరపుష్టి-రామచంద్రం రూపురేఖా విలాసాలు! నేను అలాగే అతనివైపు స్నేహ గౌరవాలతో చూస్తూండిపోయాను.


మీ కొరకు ....

మేము

తయారిస్తున్నాము

SNA

శ్రీ నిత్యా బనియన్లు

* బనియన్లు
* జెట్టీలు
* ఫేన్సీ కలర్ రకాలు

: తయారించువారు :

**SRI NITHYA HOSIERIES**

11-C, Ramaiah Colony

TIRUPUR-638 602.

Stockists :

**G. K. Banians**

Vastralatha, Vijayawada-520 001.

ఇంతలో రామచంద్రం భార్య వచ్చి, మంచాలు వాల్చి, దిండ్లువేసి పక్కలు పరిచింది. మరచెంబుతో నీళ్ళు, గ్లాసులు పెట్టింది.

రామచంద్రం కూడా వచ్చి తన మంచంలో కూర్చున్నాడు. 'నిద్ర వస్తోందా!' అడిగాడు!

'లేదులే! ఏవైనా సంగతులు చెప్పు వింటాను!' అన్నాను.

'ఏముంటాయి ఇక్కడి విశేషాలు?'

'అవే మీ వ్యవసాయ సంగతులూ, ఇతర జీవన పరిస్థితులూ.'

'నీకు తెలియని వేమున్నాయ్! ఈ రోజుల్లో ఎక్కడైనా సామాన్య రైతుల పరిస్థితులు ఇంతే! మన స్వగ్రామంలో ఋణబాధలు తట్టుకోలేక, అక్కడవున్న కొంచెం అదీ అమ్మి, అప్పులు తీర్చేసి, మిగిలిన డబ్బుతో ఇక్కడికి వచ్చి, ఈ భూమిని కొని, చెట్టు పుట్టా కొట్టి బాగుచేసి, సేద్యంలోకి తీసుకొచ్చాం. రెండుమూడేళ్ళనుంచి భూములు పంటకి తిరిగాయి. కానీ ఈ రోజుల్లో ఏంచేయాలన్నా డబ్బు కావాలి. ఇక్కడ బ్యాంకులు, పరపతి సంఘాలు, ప్రభుత్వశాఖలు ఉన్నాయిగాని పేదరైతులకు అంత అందుబాటులో వుండవు. ఉన్నా అనేక ఇబ్బందులు. సమయానికివ్వరు! సక్రమంగా యివ్వరు! అంచేత ఎటుగూడీ వడ్డీ షావుకార్లే శరణ్యం! వాళ్ళదగ్గర అప్పుతెస్తే ఆ వడ్డీలకిందే స్థిరచరాస్తులు చెల్లు!

దానికి తగ్గట్టు చిన్నచేపని పెద్దచేప, పెద్దచేపని అంతకంటె పెద్దచేప మింగేసినట్లు—ఈ రైతుల వ్యవహారాలుంటాయి. ఇందులో ఇంకోటుంది చూశావూ—రండుకూ, మొండుకీ, దగాకి దౌర్జన్యానికి తెగించే రకాలుంటారే, వాళ్ళు ఏదో విధంగా బాగుపడుతూనే ఉంటారు. అది అందరికి చేతకాదు. మన ప్రాంతంవారిలో అమాయకులూ అసహాయులూ కావడంవల్ల న్యాయం, ధర్మం అంటూ పడుమనోవటంవల్ల నానాటికీ దరిద్రులవుతున్నారు.

కొంతమంది ఎక్కడినుంచో, వచ్చేటప్పుడు వొట్టి చికాకుగా వచ్చినా, వాళ్ళ లౌక్యం, మోసం, దోపిడీ తత్వంవల్ల అప్పుడే బాగుపడి భూములు కొంటూ, ఆస్తులు కూడ



'అనుసంధన' చిత్రంలో

రాధిక, సోమయాజులు.

బెడుతూ, అంతస్తులు నిర్మిస్తూ. తారాజువ్వల్లా పైకి లేచి పోతున్నారు. ఇలా బాగుపడ్డవాళ్ళు ఇంతకుముందే భాగ్యవంతులైనవాళ్ళు వీళ్ళంతా ఇప్పుడొకటే జాతి! అంతకుముందు ఏ జిల్లావాడో, ఏ మూలవాడో ఒకరికొకరు పట్టించుకొని వాళ్ళు. కొత్త కలిసొచ్చి బాగుపడగానే స్నేహాలు, బంధుత్వాలు కలిపేసుకుంటారు.

విచిత్రంగా సామాన్య జనాన్ని మోసంచేస్తూ, కూలీల శ్రమని కొల్లగొడుతూ వ్యాపారులుగా ఎదిగిపోయేవాళ్ళూ, భూస్వాములుగా పెరిగిపోయేవాళ్ళూ, ఇక్కడ పలుకుబడి పెంచుకొంటున్నారు. రాజకీయాలు వెలిగిస్తున్నారు. స్వార్థాలను నెరవేర్చుకుంటున్నారు. ఈ విధంగా ప్రత్యేకంగా తయారవుతున్న సంపన్న వర్గం, మిగిలిన బలహీన వర్గాల్ని అణద్రొక్కబడే జాతులుగా, హీనమైన తెలివితక్కువ మూకలుగా పరిగణిస్తోంది. పూర్వం ఇంగ్లీషువాళ్ళు మన దేశంలో వలసలు స్థాపించి, మనమీద పెత్తనం చెలాయిస్తూ, వర్ణవిచక్షణతో మనల్ని అస్పృశ్యులుగా చూచినట్టు ఇప్పుడీ వర్గం ఇక్కడ మాలాంటి సామాన్య జనాన్ని సరిగ్గా అట్లాగే చూస్తోంది. ఇదీ ఇక్కడి ముఖ్యమైన విశేషం!' రామచంద్రం ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు.


అన్నదాతలైన, ధర్మవర్తనులైన పేదరైతుల గుండెల్లో ఎంత బడబాగ్ని దాగివుందో రామచంద్రాన్ని తలచుకుంటుంటే తెలిసివస్తుంది.

ఏవో తెలియని ఆవేదనతో నా గుండె బిగుసుకుపోయింది. ఎందుకో అప్రయత్నంగా నా కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఏమీ మాట్లాడలేకపోయాను.

'ఈ దేశంలో కష్టపడేవానికి, నీతిగా నడచుకునేవాడికి ఈ బాధలు ఎప్పుడూ ఉండేవే! అనవసరంగా మా గొడవంతా చెప్పి నిన్ను కలతపెట్టినట్టున్నాను. పడుకో కృష్ణా! పగలంతా అలసిపోయినట్టున్నావు.' అంటూ రామచంద్రం మంచం క్రిందనున్న మంచినీళ్ల గ్లాసులోకి వంచుకుని త్రాగి, మంచంలో వాలి కళ్ళు మూసుకున్నాడు.

ఉదయం నా కోసం ప్రత్యేకంగా తయారుచేసిన కాఫీ టిఫిన్లు ఆరగించినాక, నా పనిమీద వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాను.

'అదేమిటి అప్పుడే వెళ్ళిపోతారా? భోజనంచేసి



బాపూజీ జ్ఞాపకార్థం ...

మనకు మిగిలింది.

వెళ్ళండి!' రామచంద్రం భార్య పట్టుపట్టింది.

'కుదరదమ్మా! నేను యింకా చాలా ప్రాంతాలు తిరగాలి. మరోసారి ఎప్పుడయినా వస్తాను. అప్పుడు ఒకటి రెండు రోజులుంటాలెండి! మీ ఆదరాభిమానాలకి ఎంతో సంతోషం!' అని నా కృతజ్ఞతలు తెలియజేశాను.

ఆ దంపతుల ముఖాల్లో ఆత్మీయతతో కూడిన విచారం రవంత అస్పష్టంగా తొంగిచూసింది.

అయినా తప్పదు. నా విధి నిర్వహణ నన్ను హెచ్చరిస్తోంది. పాపకి టాటా చెప్పి, ఆ యువదంపతుల వద్ద సెలవు పుచ్చుకొని బరువుగా బయటికి వచ్చేశాను.

ఆ రైతు దంపతుల జీవితంలోని వెలుగునీడల్ని గురించి ఆలోచించుకొంటూ వాళ్ళ ఆదరాభిమానాలతో కూడిన ఆతిథ్యాన్ని తలచుకొంటూ అనిర్వచనీయమైన ఏదో అనుభూతితో నా గమ్యంవైపు సాగిపోయాను.

(సంపూర్ణం)

